ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 18.05.2024 సమయం : 1.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయం సాధించడంతో, మరిన్ని రూట్లలో ఈ పథకాన్ని విస్తరించే యోచనలో ఉన్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.
2. తెలంగాణ ఎప్ సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంజినీరింగ్ లో 74.98 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 89.66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
3. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం పనుల్ని వచ్చే నెల 12వ తేది లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు.
4. రాష్ట్రంలో ఈ రోజు, రేపు ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**ఉచిత బస్సు సదుపాయం:**

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం విషయంలో ఎలాంటి ఇబ్బందీ ఉండదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి ఒక ప్రకటన జారీ చేస్తూ , ఇంకా రూట్లను , కొత్త బస్సులను పెంచి , పథకాన్ని మరింత విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేయడాన్ని ప్రధాన మంత్రి స్థాయిలో జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. కొన్ని రాష్ట్రాలు స్థానిక పరిస్థితుల దృష్ట్యా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాయని చెప్పారు. ఆర్టీసీ ప్రయాణానికి-మెట్రో ప్రయాణానికి సంబంధం లేదని, మెట్రో లో బోగీల సంఖ్య పెంచాలని ఇప్పటికే తాము కోరినట్లు మంత్రి పేర్కొన్నారు. --------MSL

**EAP CET**

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ ఎప్ సెట్ ఫలితాలు ఈ ఉదయం విడుదలయ్యాయి. విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం , ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి తో కలిసి జేఎన్టీయూ హైదరాబాద్ లో ఈ ఫలితాలు విడుదల చేశారు. ఇంజినీరిం గ్ లో 74.98 శాతం మం ది విద్యా ర్థులు ఉత్తీర్ణత సాధించగా , అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 89.66 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంజనీరింగ్ లో ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎస్. జోతిరాదిత్య మొదటి ర్యాంకు , కర్నూల్ జిల్లాకు చెందిన హర్ష రెండో ర్యాంక్ సాధించగా , సికింద్రాబాద్ కు చెందిన రిషి శేఖర్ మూడో ర్యాంకు సాధించాడు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో అన్నమయ్య జిల్లా, మదనపల్లెకు చెందిన ప్రణీత మొదటి ర్యాంకు, విజయనగరానికి చెందిన రాధాకృష్ణ రెండు, హనుమకొండకు చెందిన శ్రీ వర్షిణి మూడో ర్యాంకు సాధించారు. మే 7 నుంచి 11 వరకు ఈ పరీక్షలు జరిగాయి. ఇంజనీరింగ్ విభాగంలో 2 లక్షల 40 వేల మంది , అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 91 వేల మంది విద్యార్థులు ఎప్ సెట్ పరీక్ష రాశారు.

PN

**CS- AMMA ADARSHA PATASHALA**

అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం పనుల్ని వచ్చే నెల 12వ తేది లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. నిన్న జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించి , పనులు వేగంగా పూర్తి చేస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను రి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పాఠశాలలు తెరిచే రోజున ప్రతి విద్యార్థికి నోట్‌బుక్‌లు , పాఠ్యపుస్తకాలు, ఒక జత స్కూల్ యూనిఫాం అందేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు, తాగునీరు, పెయింటింగ్, ఫర్నీచర్ పనులు నాణ్యతగా జరిగేలా

పర్యవేక్షించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు, సేకరణ గురించి శాంతికుమారి ప్రస్తావిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు వేగంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.
SDP

**వరంగల్ అమ్మ ఆదర్శ పాఠశాలలు**

వరంగల్ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు జూన్ 5కల్లా పూర్తి చేస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలలలో పిల్లలు చదువుకోవాలన్న ఉద్దేశంతో అమ్మ ఆదర్శ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నమని చెప్పారు.
పీటీసీ, వరంగల్

**ఆదర్శ పాఠశాల- సిరిసిల్లా**

వేసవి సెలవుల తర్వాత బడులు పున :ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులు పూర్తి చేయాలని , రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల , అల్మాస్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు , వీర్నపల్లి మండలం కంచర్ల మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ , గర్జనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేయనున్న మరమ్మతు పనుల ప్రణాళికను కలెక్టర్ అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి పరిశీలించారు.
పీటీసీ, సిరిసిల్లా

**AMMA AADARSHA-ADILABAD**

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనుల్ని సమీక్షించారు.
PTC, ADILABAD

**VINOD KUMAR**

ఈ ఆరుసెలల్లో తన ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం అని చెప్పుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమీ లేదని బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎంపి, బోయినిపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నేటి మంత్రుల సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రానికి మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. తొలకరి కురిసేలోపే రైతులకు ఎకరాకు 7500 రూపాయల పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేస్తూ... యాసంగి రైతుబంధు పంటలు కోసే సమయానికి ఇచ్చారని విమర్శించారు. అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలని , తడిసిన ధాన్యం రైతుల దగ్గర ఎంత ఉన్నా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వినోద్ అన్నారు.

MSL/PN

**CHEPA PRASADAM**

హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు బత్తిని కుటుంబం తెలియజేసింది. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజు, ఈ చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. ఈ ప్రసాదం తింటే ఆస్తమా తగ్గుతుందని నమ్ముతారు. చేపతో ప్రసాదం మింగడం ఇష్టం లేనివారికి బెల్లంతో అందజేస్తారు.

PN

**నిర్మల్ జిల్లా**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. నిన్న సాయంత్రం నిర్మల్ కలెక్టరేట్ లో వరి ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలకు ధాన్యం

తడవకుండా రైతులకు సరిపడినన్ని టార్పాలిన్ లు , ధాన్యం సంచులను అందుబాటులో ఉంచాలని సూచించారు.

పీటీసీ, నిర్మల్

**WEATHER:**

రాష్ట్రంలో ఈరోజు, రేపు ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణం కేంద్రం తెలియజేసింది. భూపాలపల్లి , ములుగు, కొత్తగూడెం, ఖమ్మం , నల్లగొండ, మహబుబాబాద్, వరంగల్, జనగామ, భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో నిన్న రాత్రి వర్షం కురిసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని , గరిష్ట ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెల్సియస్ , కనిష్ట ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల సెల్సియస్ నమోదవుతాయని అంచనా వేసింది.

PN

**వరద ముంపు**

వరద ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను అదేశించారు. నిన్న సాయంత్రం కమిషనర్ శేరిలింగంపల్లి జోన్ లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బయోడైవర్సిటీ, క్యూ మార్ట్, డిఎల్ఎఫ్ ప్రాంతాలను సందర్శించి వరద నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులకు అదేశించారు.

-MSL

**TTD**

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఆగస్టు కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం విడుదల చేసింది. ఎల్లుండి ఉదయం 10 గంటల నుంచి ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఆగస్టు నెలకు సంబంధించి దర్శనం , గదుల టికెట్లను ఈ నెల 23న , స్పెషల్ ఎంట్రీ టికెట్లను

24న విడుదల చేస్తామని పేర్కొంది. మరోవైపు , తిరుమలలో ఈ రోజు భక్తుల రద్దీ పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్టుమెంట్లు నిండి వెలుపల క్యూలో భక్తులు వేచి ఉన్నారు.

PN

**YADADRI**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్లాస్టిక్ పై నిషేధం విధించింది. ఆలయ పరిసరాల్లోఈ నిషేధం అమలులో ఉంటుందని ఈవో ఉత్తర్వు జారీ చేశారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా ప్లాస్టికేతర వస్తువులు వాడాలని , ఈ నిషేధాన్ని విధిగా పాటించాలని ఆదేశించారు.

PN

**HYD METRO**

రద్దీ పెరిగిన దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ మెట్రో రైలు వేళల్లో అధికారులు మార్పులు చేశారు. ఇప్పటి వరకు రాత్రి 11 గంటలకు చివరి రైలు ఉండగా.. ఇక నుంచి 11.45 గంటలకు చివరి రైలు అందుబాటులో ఉండనుంది. ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటలకే మెట్రో రాకపోకలు మొదలు కానున్నాయి. మిగతా రోజుల్లో సాధారణంగానే ఉదయం 6 గంటల నుంచే మెట్రో రైలు నడుస్తుంది.

PN

**స్కిల్ డెవలప్ మెంట్ సంస్థ**

జాతీయ స్కిల్ డెవలప్ మెంట్ సంస్థ, హైదరాబాద్ విభాగం వచ్చే విద్యా సంవత్సరానికి రెండేళ్ళ ఆర్కిటెక్చరల్ డ్రాఫ్ట్స్ మెన్ , రెండేళ్ళ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ , ఏడాది ఐటీటీ టెక్నీషియన్ కోర్సులకు పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించింది. మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు, ట్యూషన్ ఫీజు లేకుండా ఉచితంగా శిక్షణ ఉంటుందనీ పేర్కొంది.

దరఖాస్తులకు www.nstiwhyderabad.dgt.gov.in వెబ్ సైట్ సందర్శించాలని సూచించింది.

MSL

**MLC**

వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టపద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు 52 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో జంబో బ్యాలెట్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తామని, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. 12 జిల్లాల పరిధిలో కి వచ్చే ఈ నియోజకవర్గంలో మొత్తం 4లక్షల 71వేల 806 మంది పట్ట భద్రుల కోసం 605 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 27న పోలింగ్, వచ్చే నెల 5న నల్లగొండలో కౌంటింగ్ ఉంటుందని చెప్పారు.

పీటీసీ, నల్లగొండ

**PG ECET**

రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ ఈసెట్PG ECET పరీక్షను వాయిదా వేయాలని జేఎన్టీయూ హైదరాబాద్ నిర్ణయించింది. జూన్ 6 నుంచి 9 వరకు జరగాల్సిన పీజీ ఈసెట్ పరీక్షను జూన్ 10 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది.

PN